సాక్షి
ఖమ్మం

శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



పాఠ్య పుస్తకాలొస్తున్నాయ్..

వచ్చే విద్యాసంవత్సరం ఆరంభంలోనే విద్యార్థులకు ఇచ్చేలా ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను జిల్లాలకు చేరవేస్తోంది. 8లో



24న నిరుద్యోగ నిరసన ర్యాలీ

జిల్లా కేంద్రంలో ఈనెల 24వ తేదీన నిరుద్యోగ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
42° / 26°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం కాస్త చల్లగా ఉండే అవకాశముంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి తారాస్థాయికి చేరుతుంది.



దావత్–ఏ–ఇఫ్తార్ !

- ఖమ్మంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు
- హాజరైన హోంమంత్రి మహమూద్ అలీ, రవాణా శాఖ మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రప్రభుత్వం తరఫున జిల్లా కేంద్రంలోని ముస్లింలకు గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ విందులో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీకి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీకగా నిలు స్తోందని... అభివృద్ధిలో దేశంలోనే ముందంజలో ఉందని చెప్పారు. సీఎం కేసీఆర్ తెలంగాణ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుండగా.. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు మరెక్కడా లేవని తెలిపారు. తెలంగాణ వచ్చాక ప్రభుత్వమే ప్రజల పండుగలు నిర్వహించే గొప్ప సంస్కృతికి కేసీఆర్ శ్రీకారం చుట్టారని వివరించారు.

ముస్లింల సంక్షేమం కోసం కృషి..

రాష్ట్రంలో దాదాపు ఐదు లక్షల మంది ముస్లింలకు ఏటా దుస్తులు, రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్నట్లు హోం మంత్రి తెలిపారు. పేదింటి మహిళల వివాహానికి షాదీముబారక్ ద్వారా రూ.1,00,116 అందజేస్తుండగా, చదువు కోసం మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. శాంతియుత సమాజం కోసం ముస్లింలు చేస్తున్న ఉపవాస దీక్షలు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి నమాజ్ ఆచరించిన మంత్రులు మహమూద్ అలీ, పువ్వాడ ఆతర్వాత వారికి వడ్డించి వారితో కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఎమ్మెల్సీ తాతా మధు, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, మైనార్టీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి మహిమూది, తహసీల్దార్ శైలజ, కార్పొరేటర్లు షేక్ మగ్బూల్, కర్నాటి కృష్ణ, గాదె అమృతమ్మతో పాటు బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, గుండాల కృష్ణ, బి.చంద్రావతి, వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.





ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు (ఇన్‌సెట్) ఖర్జూరా తినిపించుకుంటున్న మంత్రులు మహమూద్ అలీ, పువ్వాడ.. చిత్రంలో ఎంపీ రవిచంద్ర, కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్ తదితరులు

న్యూస్‌రీల్

సమ్మర్ కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ సమ్మర్ కోర్సుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సోమశేఖర శర్మ ఒక ప్రకటనలో సూచించారు. వచ్చే నెల 1వ తేదీన మొదలయ్యే ఈ కోర్సు 42 రోజుల పాటు హైదరాబాద్, హన్మకొండ, నల్లగొండ, నిజామాబాద్, కరీంనగర్‌లో ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి అడ్మిషన్ కార్డు పొంది తమకు సమీపంలోని సెంటర్‌లో సమర్పించాలని తెలిపారు.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ బేగంపేట, రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ప్రవేశానికి జిల్లాలోని గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. జిల్లా నుంచి ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలకు అవకాశం ఉండగా, విద్యార్థులు అన్ని వివరాలతో దరఖాస్తుకు ఒక పాస్‌ఫొటో అతికించి ధృవపత్రాలతో అందజేయాలని సూచించారు. 2017 జనవరి 1 నుంచి డిసెంబర్ 31లోపు జన్మించిన వారై ఉండాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారైతే వార్షికాదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల వారైతే రూ.2లక్షల లోపు ఉన్నవారు అర్హులని, దరఖాస్తులను ఈనెల 29న సాయంత్రం 5 గంటల్లోగా కలెక్టరేట్‌లోని గిరిజనాభివృద్ధి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వచ్చే నెల 3న డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.


‘కంటి వెలుగు’కు మంచి స్పందన



శిబిరంలో పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాంబాబు

నేలకొండపల్లి: జిల్లాలో కంటి వెలుగు శిబిరాలకు మంచి స్పందన వస్తోందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాంబాబు తెలిపారు. మండలంలోని కోనాయిగూడెంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని గురువారం పరిశీలించిన ఆయన రికార్డులు తనిఖీ చేశాక మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 4.16 లక్షల మందికి కంటి పరీక్షలు చేయగా, 89,822 మందికి కళ్లద్దాలు అందించినట్లు తెలిపారు. ఇంకా 40,688 మందికి త్వరలోనే అద్దాలు వస్తాయని చెప్పారు. కాగా, శస్త్రచికిత్స అవసరమైన వారి వివరాలను నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు. బోదులబండ వైద్యాధికారి గీత, రాధాకృష్ణ, సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, ఉద్యోగులు కె.వాణి, బోళ్ల వీరబాబు, పద్మ, ఆబేదా, చెరుకుపల్లి బేబి పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌ను పరామర్శించిన కలెక్టర్, సీపీ



నవీన్‌తో మాట్లాడుతున్న కలెక్టర్, సీపీ

ఖమ్మంక్రైం: కారేపల్లి మండలం చీమలపాడులో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో తీవ్రంగా గాయపడిన హెడ్ కానిస్టేబుల్ నవీన్ ఖమ్మంలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను గురువారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి పరామర్శించారు. ఆయనకు అందుతున్న చికిత్సపై వైద్యులతో మాట్లాడారు. అడిషనల్ డీసీపీ సుభాస్‌చంద్రబోస్, ఏసీపీలు గణేష్, రామోజీ రమేష్, ఏసీపీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్, సీపీ

ఖమ్మంలీగల్: గోదావరిఖనికి బదిలీ అయిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావును గురువారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్‌సురభి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తికి వారు పుష్పగుచ్ఛం అందజేశారు.

బూస్టర్ డోస్‌కు సిద్ధం

- జిల్లాకు 17వేల డోస్‌ల కార్బోవ్యాక్స్
- ఆస్పత్రులకు చేరవేసిన అధికారులు
- కరోనా కేసులు పెరుగుతుండడంతో ప్రజలకు అవగాహన



ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో ఈనెలారంభం నుండి కరోనా కేసులు వెలుగు చూస్తున్నాయి. కొన్ని రోజులుగా ప్రతీరోజు పదుల సంఖ్యలో పాజిటివ్ కేసులు నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఇన్ని రోజులు పట్టించుకోని అధికారులు బూస్టర్ డోస్‌పై దృష్టి సారించారు. జిల్లాలో కరోనా వ్యాక్సిన్ నిల్వలు అడుగంటగా, రాష్ట్రానికి కేంద్రం అందజేసిన ఐదు లక్షల డోస్‌ల నుంచి జిల్లాకు గురువారం కార్బోవ్యాక్స్ పంపించగా.. జిల్లాలోని జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, యూహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు చేరవేశారు. కరోనా వ్యాప్తి దృష్ట్యా అర్హులైన ప్రతీ ఒక్కరూ మూడో డోస్ వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

17 వేల డోసుల సరఫరా

కరోనా కేసులు పెరుగుతుండడంతో ఇప్పటికే రెండు డోస్‌ల టీకా వేయించుకున్న వారు మూడో డోస్ వేయించుకునేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాకు గురువారం 17వేల కార్బోవ్యాక్స్ డోస్‌లు రాగానే వివిధ ఆస్పత్రులకు పంపించారు. అర్హులైన ప్రతీ ఒక్కరు బూస్టర్ డోస్ వేయించుకునేలా అవగాహన కల్పించేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలో 12 ఏళ్ల వయస్సు నుండి వృద్ధుల వరకు మొదటి, రెండో డోస్ వ్యాక్సిన్ నూరు శాతం పూర్తయింది. కానీ 18 ఏళ్లు నిండిన వారికి మూడో డోస్ మొదలుపెట్టినా పెద్దగా ఆసక్తి చూపించకపోవడంతో 46 శాతం మాత్రమే పూర్తిచేయగలిగారు. కోవిడ్ ప్రభావం తగ్గడంతో ప్రజలు వ్యాక్సిన్ మరిచిపోగా.. మళ్లీ కేసులు పెరుగుతుండడంతో దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది.

పెరుగుతున్న కరోనా కేసులు

కరోనా బారిన పడిన ఓ వ్యక్తి ఈనెల 7న ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం ఆందోళనకు గురిచేసింది. దీంతో అధికారులు ఆస్పత్రుల్లో బెడ్లు, మందులు, ఆక్సీజన్ సిద్ధం చేసి కేసులు ఎన్ని వచ్చినా చికిత్స చేసేలా సమయాత్తమయ్యారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిలోని కోవిడ్ వార్డులో పదిహేను మంది వరకు చికిత్స చేయించుకోగా ప్రస్తుతం ఎవరూ లేరు. అయినప్పటికీ ఈనెల 1నుండి 19వ తేదీ వరకు జిల్లాలో 11,071 మందికి పరీక్షలు చేయగా 146 పాజిటివ్ కేసులు నమోదు కావటం ఆందోళన కలిగిస్తోంది. దీంతో కరోనా జాగ్రత్తలు పాటించేలా, వ్యాక్సిన్ వేయించేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయొద్దు



మూడో డోస్‌ను ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయొద్దు. రెండు డోస్‌ల టీకా వేసుకున్న వారు కరోనా వ్యాప్తి దృష్ట్యా బూస్టర్ డోస్ కూడా వేయించుకోవాలి. కోవిషీల్డ్, కోవాగ్జిన్‌లో ఏ వ్యాక్సిన్ తీసుకున్నా సరే కార్బోవ్యాక్స్ టీకా తీసుకోవచ్చు. 18 ఏళ్లు నిండి, రెండు డోస్‌లు తీసుకున్న వారే బూస్టర్ డోస్‌కు అర్హులు. ఈమేరకు సెంటర్లకు వచ్చి టీకా వేయించుకోవాలి.

– డాక్టర్ ప్రమీల, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

జిల్లాలో వ్యాక్సినేషన్ వివరాలు

బూస్టర్ డోస్ లక్ష్యం	11,00,592
టీకా వేయించుకున్న వారు	5,08,120

గత పది రోజుల్లో నమోదైన కరోనా కేసులు

తేదీ	పరీక్షలు	పాజిటివ్ కేసులు
12	682	16
13	673	14
14	625	07
15	781	02
16	195	14
17	885	06
18	963	12
19	849	13

రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని తహసీల్దార్లతో టీఎం–33, జీఎల్‌ఎం సక్సేషన్, జీఓ 58, 59 తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. టీఎం–33కు సంబంధించి 2022 సంవత్సరం వరకు పెండింగ్‌లో ఉన్న వాటిని వారంలోగా పరిష్కరించాలన్నారు. జీఎల్‌ఎం సక్సేషన్‌కు ఫైళ్లు సమర్పించాలని, జీఓ 58, 59 గడువు పొడిగించినందున ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జీఓ 59లో భాగంగా అర్హులైన వారు ఖమ్మం డివిజన్‌లో రూ.26కోట్లు, కల్లూరు డివిజన్‌లో రూ.40కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ.11కోట్లు వసూలయ్యాయని తెలిపారు. మిగతా వారు నగదు చెల్లించేలా చైతన్యం చేయాలన్నారు. ఇక కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు విచారించాలని కలెక్టర్ సూచించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, డీఆర్వో శిరీష, ఆర్డీఓ రవీంద్రనాథ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు వెంకటేశ్వర్లు, రాంబాబు, సత్యనారాయణ, హౌజింగ్ డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విన్నపాలు బుట్టదాఖలేనా?

- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో సభ్యుల ఆవేదన
- గైర్హాజరైన అధికారులకు నోటీసులు ఇవ్వాలని సూచన
- తాగునీటి సమస్యపై దృష్టి సారిస్తామన్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ఖమ్మం సహకారనగర్: ప్రజల సమస్యలను సమావేశాల్లో ప్రస్తావిస్తున్నాం.. గత జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పెనుబల్లి మండలంలోని పలు గ్రామాలకు నీరు రావడం లేదని చెప్పాం.. అయినా నేటికీ సమస్య పరిష్కరించలేదు. ఇలా తమ విన్నపాలన్నీ బుట్టదాఖలవుతున్నాయని పెనుబల్లి జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు అధికారులపై మండిపడ్డారు. ఈ అంశంపై స్పందించిన అధికారులు సమస్య పరిష్కారానికి రూ.5లక్షల నిధులు అవసరమని చెప్పడంతో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ జెడ్పీ నిధుల నుంచి మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. ఇలా పలువురు ప్రజాప్రతినిధులు అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

వాడీవేడిగా సమావేశాలు

జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. తొలుత రెండో స్థాయీ సంఘమైన గ్రామీణాభివృద్ధిపై అధికారులు ప్రగతి నివేదికలు సమర్పించగా, ఉపాధి పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని సభ్యులు కోరారు. ఆతర్వాత విద్య, ఆరోగ్య శాఖలో సమీక్షలో ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి మెడికల్ కళాశాల తరగతులు నిర్వహించేందుకు అనుమతి లభించిందని తెలిపారు. కూసుమంచి మండలం జుజ్జుల్‌రావుపేట సమీపాన నర్సింగ్ కళాశాల, రఘునాథపాలెం మండలంలో ఏరియా ఆస్పత్రి నిర్మించే అవకాశం ఉందన్నారు. కాగా, విద్యాశాఖ సమీక్షలో రఘునాథపాలెం మండలంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ ప్రియాంక ఏఎంఓ రవికుమార్‌కు సూచించారు. ఆతర్వాత మహిళా సంక్షేమం, ప్లానింగ్, ఆర్థిక సంఘాలపై సమీక్షలు జరిగాయి. కల్లూరు జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు తెరిచినా ధాన్యం సేకరించడం లేదని తెలిపారు. ఇదిలా ఉండగా ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల శాఖాధికారులు సమావేశానికి హాజరుకాకపోవటంతో చైర్మన్ కమల్‌రాజ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారికి నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఇక 3, 6వ సంఘాల సభ్యులు హాజరుకాకపోవటంతో వాయిదా వేశారు. ఈసమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పంట నష్టపరిహారం చెల్లింపునకు ఏర్పాట్లు

ఖమ్మంవ్యవసాయం: గతనెలలో కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం నిధులు మంజూరు చేసింది. దీంతో తదుపరి ప్రక్రియపై వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించారు. ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారంగా నిధులు మంజూరు చేసింది. జిల్లాలో 18,258 మంది రైతులకు చెందిన 23,632.17 ఎకరాల్లో జరిగిన పంట నష్టం జరిగినట్లు నిర్ధారించగా రూ.23,63,24,250 మంజూరయ్యాయి. వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక ఖాతా ప్రారంభించి నిధులు జమ అయ్యాక, రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కట్టారు.. వదిలేశారు!



పువ్వాడనగర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం

- పడావు పడుతున్న ‘డబుల్’ ఇళ్లు
- పువ్వాడ నగర్‌లో కేటాయించని 50గృహాలు
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పేదలు

రఘునాథపాలెం: పేదలకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్రప్రభుత్వం కొన్నేళ్ల క్రితం ప్రకటించింది. ఇందులో భాగంగా ఇళ్లు నిర్మించినప్పటికీ ఎవరికీ కేటాయించకుండా వదిలేయడంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. మరోపక్క నిరుపేదలు తమకు నిలువ నీడ లేదని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఖమ్మం నగరంలోని నిరుపేదల కోసం పువ్వాడ నగర్‌లో 2016సంవత్సరంలో తొమ్మిది బ్లాక్‌లుగా, బ్లాక్‌కు 24 డబుల్ బెడ్‌రూం ఇళ్ల చొప్పున మొత్తం 216గృహాలు నిర్మించారు. ఇందులో నగరంలోని ఐదు డివిజన్ల వాసులు 166మందికి లాటరీ ద్వారా అప్పట్లో గృహాలు కేటాయించారు. మిగతా 50ఇళ్లను మాత్రం ఎవరికీ ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు తాళాలు వేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ అంచనా ప్రకారం రూ.5లక్షలు వెచ్చించినా.. 50ఇళ్లకు రూ.2.5కోట్ల మేర వ్యయమవుతుంది. కానీ ఈ ఇళ్లను ఎందుకు కేటాయించకుండా నిరుపయోగంగా వదిలేశారో అంతుపట్టడం లేదు. మరోపక్క అనేక మంది పేదలు నిలువ నీడ లేనందున తమకు ఇళ్లు కేటాయించాలని అధికారుల, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోకపోగా.. కొన్ని గృహాలు శిథిలావస్థకు చేరుతున్నాయని తెలుస్తోంది. ఇకనైనా అధికారులు స్పందించి ఇళ్లను అర్హులైన పేదలకు కేటాయిస్తే వారి కష్టాలను తీర్చినట్లవుతుంది.

దోపిడీదారులంతా బీజేపీలోనే...

- కాంగ్రెస్ వైఫల్యంతోనే బీజేపీ ఎదుగుదల
- దేశ రక్షణ బాధ్యత కమ్యూనిస్టులదే
- సీపీఐ ప్రజాపోరు యాత్రలో మంత్రి అజయ్, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సభలో అభివాదం చేస్తున్న మంత్రి అజయ్ కుమార్, కూనంనేని సాంబశివరావు, పోతినేని సుదర్శన్‌రావు, బాగం హేమంతరావు తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రశ్నించే వారు జైళ్లలో మగ్గుతుండగా.. దోపిడీదారులు మాత్రం బీజేపీలో చేరి నాయకులుగా చెలామణి అవుతున్నారని సీపీఐ, బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులు ఆరోపించారు. బీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎం సమైక్యంగా పోరాడి వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విజయ దుందుభి మోగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సీపీఐ చేపట్టిన ప్రజాపోరు యాత్ర గురువారం రాత్రి ఖమ్మం చేరుకోగా, ముస్తఫానగర్‌లో బహిరంగ సభ ఏర్పాటుచేశారు. ఈ సభకు ఎస్.కే.జానీమియా అధ్యక్షత వహించగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీని అడ్డుకోవడమే బీఆర్‌ఎస్ అజెండా అని తెలిపారు. దేశం, రాష్ట్రంలో బీజేపీకి అధికారం దక్కొద్దనే లక్ష్యంతోనే పని చేస్తున్నామని స్పష్టం చేశారు. స్వార్థం లేని కమ్యూనిస్టులు ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని.. ఇప్పుడు దేశ రక్షణ ప్రధాన సమస్యగా మారడంతో సీపీఐ చేపట్టిన ప్రజాపోరు యాత్రకు సంఘీభావం ప్రకటించామని తెలిపారు. గోద్రా ఘటనలో దోషులుగా ఉన్న వారు ఇప్పుడు నీతి వ్యాఖ్యలు చెబుతున్నారని అజయ్ ఎద్దేవా చేశారు. సీపీఐకి జాతీయ హోదా తొలగింపు వెనుక బీజేపీ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఇక కాంగ్రెస్ వైఫల్యాలే బీజేపీ ఎదుగుదలకు దోహదం చేశాయని మంత్రి తెలిపారు. సీబీఐ, ఈడీలు కేంద్రప్రభుత్వానికి తొత్తులుగా మారాయని.. దురదృష్టవశాత్తు ఎన్నికల కమిషన్ కూడా అదే బాటలో ఉండడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు. మోదీ అధికారంలోకి రాగానే ధనాధన్ రూ.15 లక్షలు వేస్తానని ఖాతాలు తెరిపించి ఐదు పైసలు కూడా వేయలేదని మంత్రి పువ్వాడ అజయ్ ఆరోపించారు.

కాషాయం కప్పుకుంటే పవిత్రులా: కూనంనేని

విపక్షాల్లో ఉంటే దోషులు, కాషాయం కప్పుకుంటే పవిత్రులా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ఆర్థికంగా అడ్డదారిన ఎదిగిన వారికి బీజేపీ పార్టీ కండువాలు కప్పుతోందని విమర్శించారు. దేశానికి బీజేపీ కేన్సర్ కంటే ప్రమాదమని.. అందుకే గ్రామగ్రామాన ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నామని తెలిపారు. తమను విమర్శించే వ్యక్తులు కమ్యూనిస్టుల త్యాగాలను తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను బీజేపీ గౌరవించకపోగా మనుధర్మాన్ని రుద్దే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీని నిలువరించి దేశాన్ని రక్షించేందుకు కమ్యూనిస్టులు నడుం బిగించారని తెలిపారు. బీజేపీకి ఒక్కసారి అధికారమిస్తే తెలంగాణలో ఏం జరుగుతుందో బండి సంజయ్ తెలిపారని పేర్కొన్నారు. ఇంకా ఈ సభలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, కె.గోవిందరావు, ఏపూరి లతాదేవి, మేకల శ్రీనివాసరావు, కార్పొరేటర్ వెంకటనారాయణతో పాటు ఏనుగు గాంధీ, సాంబశివారెడ్డి, లక్ష్మీనారాయణ, ఎం.డీ.జాకీర్, వీరన్న, జబ్బార్, మీరా పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రికెట్ అకాడమీకి ఎంపిక


అంజలి

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల ఆధ్వర్యాన కొనసాగుతున్న క్రికెట్ అకాడమీకి ఖమ్మంకు చెందిన కె.అంజలి ఎంపికైంది. రెండేళ్లగా క్రికెట్‌లో శిక్షణ పొందుతున్న ఆమె ప్రస్తుతం ఐదో తరగతి చదువుతుంది. తాజాగా వనపర్తి జిల్లా మహిళా క్రికెట్ అకాడమీకి ఎంపికైన ఆమె విద్యాభ్యాసం కూడా అక్కడ కొనసాగుతుంది. ఈసందర్భంగా అంజలిని గురువారం డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డితో పాటు డాక్టర్ కూరపాటి ప్రదీప్, ఎం.డీ.మతిన్, రమేష్‌బాబు, టి.సునీల్‌రెడ్డి, అఫ్జల్ హసన్, శివ తదితరులు అభినందించారు.

కేయూ ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు పురస్కారం


శ్రీనివాసరావు

ఎర్రుపాలెం: కాకతీయ యూనివర్సిటీ ప్రభుత్వ పాలనాశాస్త్రం ప్రొఫెసర్ డాక్టర్ పెదమళ్ల శ్రీనివాసరావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరిట ఇచ్చే జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఏపీ రాష్ట్రంలోని విశాఖపట్నంకు చెందిన అఖిలభారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఈ అవార్డును ప్రకటించింది. త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న సమావేశంలో ఆయనకు పురస్కారాన్ని అందజేస్తారు. ఈసందర్భంగా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడుకు చెందిన శ్రీనివాసరావును గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

రూ.1.52కోట్లకు వ్యాపారి ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: భద్రాచలం పట్టణానికి చెందిన కిరాణం వ్యాపారి మిట్టపల్లి సుబ్రహ్మణ్యం రూ.1,52,38,440కు గాను గురువారం దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేశారు. కొత్తగూడెం, ఖమ్మంల్లో కిరాణ వ్యాపారం చేసే సుబ్రహ్మణ్యం పలువురి వద్ద అప్పులు చేశాడు. అయితే, అప్పులు తీర్చలేని పరిస్థితి ఎదురైందని చెబుతూ 32 మందిని ప్రతివాదులుగా చూపిస్తూ ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాది మందడపు శ్రీనివాసరావు ద్వారా ఐపీ దాఖలు చేశాడు.

రూ.10 లక్షలకు హోటల్ నిర్వాహకుడు..

ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన హోటల్ నిర్వాహకుడు నూకల కిరణ్‌కుమార్ రూ.10,02,500కు దివాలా పిటిషన్ దాఖలు చేశాడు. హైదరాబాద్‌లో హోటల్ నిర్వహించిన ఆయన కరోనాతో నష్టాలు రావడంతో ఖమ్మం వచ్చాడు. ఆ సమయంలో తీసుకున్న అప్పులు తీర్చలేకపోతున్నానంటూ పదహారు మందిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవాది కోన చంద్రశేఖరగుప్తా ద్వారా సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐపీ దాఖలు చేశాడు.

ధాన్యం లోడ్ డీసీఎం బోల్తా

నేలకొండపల్లి: ధాన్యం లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ పల్టీ కొట్టింది. ఈఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా నుంచి ధాన్యం లోడ్‌తో గురువారం వస్తున్న డీసీఎం వ్యాన్ నేలకొండపల్లి మండలం చెరువుమాధారం క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు పల్టీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ అంజయ్యకు స్వల్ప గాయాలు కాగా, రోడ్డుపై ధాన్యం బస్తాలు పడడంతో ఖమ్మం–కోదాడ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు చేరుకుని ధాన్యం బస్తాలు తీయించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

చెరువును పరిశీలించిన అధికారులు

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం చెరువును జలవనరుల శాఖ సీఈ శంకర్ నాయక్ గురువారం పరిశీలించారు. చెరువు శిఖంను కొందరు రియల్టర్లు, స్థానికులు ఆక్రమించారని ఫిర్యాదులు అందడంతో సీఈ ఉద్యోగులతో కలిసి సిబ్బందితో కలిసి పరిశీలించి విస్తీర్ణం మేరకు ఉందా లేదా, అని ఆరా తీశారు. ఆక్రమణలు ఉంటే తొలగించి భూమిని స్వాధీనం చేసుకోవడమే కాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఈ తెలిపారు.

స్థలవివాదంపై విచారణ

రఘునాథపాలెం: మండలంలోని పంగిడి గ్రామంలో గతంలో ప్రభుత్వ పాఠశాల నిర్వహించిన స్థలం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. అయితే, ఆ స్థలంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తుండగా స్థానికులు కలెక్టర్ గౌతమ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ నర్సింహరావు, ఎంఈఓ శ్రీనివాస్ గురువారం ఆ స్థలాన్ని పరిశీలించి ఇరువర్గాల నుంచి వివరాలు సేకరించారు. విద్యాశాఖ వద్ద ఉన్న పత్రాలను పరిశీలించే వరకు నిర్మాణ పనులను నిలిపివేయాలని తహసీల్దార్ ఆదేశించారు.

ప్రమాదంలో ఒకరు మృతి

కామేపల్లి(కారేపల్లి): మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. కామేపల్లి మండలం కొత్తలింగాలలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్ వద్ద గురువారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. కామేపల్లికి చెందిన తెనాలి హనుమంతు ఖమ్మం నుండి ఆటోలో కామేపల్లి బయలుదేరాడు. కొత్తలింగాల వద్ద ఆటో చెడిపోవడంతో నడిచి వెళ్తున్నాడు. ఈక్రమంలోనే ఖమ్మంలో సుతారీ పని ముగించుకుని మోటార్‌సైకిల్‌పై వేగంగా వచ్చిన కారేపల్లి మండలం మేకలతండాకు చెందిన గుగులోత్ మల్సూర్(36) హనుమంతును తప్పించే క్రమంలో బైక్ పైనుంచి కింద పడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, ఆటోలో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మల్సూర్ మృతి చెందాడు. ఆయనకు భార్య లీల, చిన్నారులైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పాఠ్య పుస్తకాలొస్తున్నాయ్...

- విద్యాసంవత్సరం మొదట్లోనే పంపిణీకి నిర్ణయం
- జిల్లాకు 7.41లక్షల పుస్తకాలు అవసరమని అంచనా
- ఇప్పటికే 2లక్షలకు పైగా గోడౌన్లలో భద్రం


గోడౌన్‌లో పాఠ్యపుస్తకాలను భద్రపరుస్తున్న సిబ్బంది

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వం విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేసేలా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మన ఊరు – మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారు. అలాగే, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు యూనిఫాం ఇచ్చేందుకు ఇప్పటికే క్లాత్‌ను పంపించారు. ఇదేక్రమంలో పాఠ్య పుస్తకాలను కూడా తొలిరోజే ఇవ్వాలని నిర్ణయించి జిల్లాకు చేరవేస్తోంది.

79వేల మంది విద్యార్థులు

వచ్చే విద్యాసంవత్సరం జూన్ 1న మొదలుకానుంది. జిల్లాలోని ప్రభుత్వ, అనుబంధ పాఠశాలలు 1,669 ఉండగా వీటిలో 79వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ సంఖ్య ఆధారంగా వచ్చే విద్యాసంవత్సరం అవసరమైన పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం ఇప్పటి నుంచే పంపిస్తోంది. జిల్లాలోని విద్యార్థులకు 7,41,700పాఠ్య పుస్తకాలు అవసరమని అంచనా రూపొందించగా, 1,84,339 పాఠ్య పుస్తకాలు వచ్చాయి. మిగతావి కూడా త్వరలో జిల్లాకు వస్తాయని. ఆతర్వాత ఎంఈఓ కార్యాలయాలకు ఆపై పాఠశాలలకు చేరవేస్తామని అధికారులు వెల్లడించారు.

ఎంతో ఉపయోగం...

పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వడం ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించిన నేపథ్యాన ప్రవేశాల సంఖ్య పెరుగుతుందని, వీరికి మొదట్లోనే పుస్తకాలు ఇస్తే చదువుపై దృష్టి సారిస్తారని భావిస్తున్నారు. సుమారు నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలు అందిస్తామని చెబుతున్నా ఆచరణలో అమలుకావడం లేదు. కొన్ని సబ్జెక్టుల పుస్తకాలు మూడు, నాలుగు నెలల వరకు కూడా రాకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. కానీ ఈసారి ముందుగానే పాఠ్యపుస్తకాలు పంపిస్తున్నా.. అన్ని సబ్జెక్టుల పుస్తకాలు వచ్చేలా చూడాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

తొలిరోజే ఇవ్వాలనేది ఆలోచన



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరికీ వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని పాఠ్యపుస్తకాలు జిల్లాకు వచ్చాయి. మిగతావి కూడా దశల వారీగా వస్తున్నాయి. ఈ అంశంపై కలెక్టర్ గౌతమ్ ప్రత్యేక దృష్టి సారించారు.

– ఈ.సోమశేఖర శర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

రాయితీతో పన్ను చెల్లించేందుకు ఆసక్తి


కమిషనర్‌కు ఆదర్శ్ సురభికి చెక్కు అందజేస్తున్న మమతా ఆస్పత్రి బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని వినియోగించుకునేందుకు యజమానులు ఆసక్తి కనబరుస్తున్నారని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మమత ఆస్పత్రి యాజమాన్యం రూ.53,06,195 పన్నులో రాయితీ పోగా రూ.45,35,210 చెక్కును కమిషనర్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్లీబర్డ్ స్కీంను వినియోగించుకునేందుకు ప్రజలు ముందుకొస్తున్నారని చెప్పారు. ఈనెలలో 8,100 మంది నుంచి రూ.4 కోట్లు ఆస్తి పన్ను చెల్లించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ ధరణికుమార్, ఆర్‌ఓ శ్రీనివాస్, ఆర్‌ఐ కె.శ్రీనివాస్, మేనేజర్ విజయానంద్ పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు తల్లాడ మండలం రామానుజవరం, మిట్టపల్లిల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొన్నాక మధ్యాహ్నం ఖమ్మం చేరుకుంటారు. ఆతర్వాత సాయంత్రం 4.30 గంటలకు రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో హెల్త్ సబ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయడమే కాక వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు కమాన్‌బజార్‌లోని జామే మజీద్‌లో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొంటారు.

పొంగులేటిని విమర్శిస్తే సహించేది లేదు..

డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు


మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ విజయబాబు

సత్తుపల్లి: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డే లక్ష్యంగా విమర్శలు చేస్తే సహించేది లేదని డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు అన్నారు. సత్తుపల్లిలో గురువారం ఆయన గౌరిగూడెం సర్పంచ్ మందపాటి ముత్తారెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో జరిగిన అవమానాలు, అన్యాయాలను ప్రశ్నిస్తుంటే నోటికొచ్చినట్టు మాట్లాడటం సరికాదన్నారు. ఎవరికీ లేని విధంగా తాతా మధుకు రెండు పదవులు ఎలా వచ్చాయో చెప్పాలని సూచించారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి నుంచి ఆర్థికసాయం పొంది ఇప్పుడు ఇలా మాట్లాడటం తగదని పేర్కొన్నారు. ఇకనుంచైనా పొంగులేటిపై వ్యక్తిగత విమర్శలు మానుకోకపోతే తాము కూడా మాట్లాడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నారపోగు వెంకట్, దూదిపాల రాంబాబు, మందపాటి రవీందర్ రెడ్డి, తోట గణేష్, కొత్తూరు కోటేశ్వరరావు, సిద్ద బోయిన సత్యనారాయణ, కాలినేని సాయి, నాగరాజు, ఒంటెద్దు సాయిలు, నాగళ్ల భాస్కర్, దొడ్డా అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

అందరిలాగే కాంట్రాక్టులు వచ్చాయి..

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి డబ్బు, కాంట్రాక్టుల కోసం బీఆర్‌ఎస్‌లో చేరారని ఆ పార్టీ నాయకులు చెప్పడం గర్హనీయమని... నిబంధనల మేరకే పొంగులేటికి కాంట్రాక్టులు దక్కించుకున్నారే తప్ప ప్రత్యేకమేమి లేదని మద్దినేని స్వర్ణకుమారి అన్నారు. ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ కష్టపడి సంపాదించుకున్న సొమ్ములో కొంత ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు వెచ్చించడం తప్పవుతుందా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మలీదు జగన్, సర్పంచ్ పరికపల్లి శ్రీను, నాయకులు నారపోగు వెంకటేశ్వర్లు, దేవరపల్లి అనంత రెడ్డి, మద్ది కిశోర్ రెడ్డి, చింతమళ్ల గురుమూర్తి, రాము, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

‘దళితబంధు’తో ఆర్థికాభివృద్ధి సాధించాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధిక

చింతకాని: దళితబంధు పథకం ద్వారా మంజూరైన యూనిట్లను సక్రమంగా వినియోగించుకుంటూ లబ్ధిదారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని అదనపు కలెక్టర్ స్నేహలత సూచించారు. మండలంలోని చింతకాని, నాగులవంచ, తిరుమలాపురం, లచ్చగూడెం, అనంతసాగర్, నర్సింహాపురంల్లో దళితబంధు యూనిట్లను గురువారం ఆమె అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తాతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు అభివృద్ధి చెందడమే కాక మరికొందరికి ఉపాధి కల్పించాలని సూచించారు. ఈమేరకు యూనిట్ల నిర్వహణ, ఆదాయం, గతంతో పోలిస్తే ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో తెలుసుకున్నారు. కాగా, యూనిట్లను లీజ్‌కు ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు దూరం కానున్న చదువు


సెమినార్‌లో మాట్లాడుతున్న ఘోష్

ఖమ్మంరూరల్/ఖమ్మంసహకారనగర్: నూతన విద్యావిధానం అమల్లోకి వస్తే మహిళలకు చదువు దూరమవుతుందని ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకురాలు ఐషీ ఘోష్ అన్నారు. ఖమ్మం మండలంలోని పెదతండాలో ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఐద్వా ఆధ్వర్యాన గురువారం ‘నూతన విద్యావిధానం – విద్యార్థినులపై ప్రభావం’ అంశంపై సెమినార్ ఏర్పాటుచేశారు. ఈ సదస్సుతో పాటు ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏరాటుచేసిన సదస్సులో ఘోష్ మాట్లాడుతూ విద్య వ్యాపారంగా మారడంతో పేదలకు అందని ద్రాక్షలా మారిందని చెప్పారు. దేశంలో విద్యాభివృద్ధికి అపారమైన వనరులు ఉన్నప్పటికీ అవి ప్రైవేట్ శక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం విద్యారంగంలోనూ మతాన్ని జొప్పిస్తూ, కార్పొరేట్లకు కట్టబెడుతోందని ఆరోపించారు. ఈ సదస్సులో ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల. భారతితో పాటు మల్లు లక్ష్మి, బత్తుల హైమావతి, బుగ్గవీటి సరళ, అఫ్రోజ్. సమీనా, మెరుగు రమణ, దుర్గాదేవి, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌తోపాటు పర్వీనా, రమేష్, తరుణ్, నవ్య, రాగిణి తదితరులు పాల్గొన్నారు.

గౌతంపూర్‌కు రూ.కోటి నజరానా

నేరుగా పంచాయతీ ఖాతాలో జమ


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ సుజాత, కార్యదర్శి షర్మిల, కలెక్టర్ అనుదీప్ (ఫైల్)

చుంచుపల్లి: జాతీయస్థాయిలో ఉత్తమ ఆరోగ్య పంచాయతీగా ఎంపికైన గౌతంపూర్‌కు డబుల్ బొనాంజా దక్కింది. జాతీయ స్థాయిలో ఆరోగ్య పంచాయతీ విభాగంలో ఈ పంచాయతీ మొదటి స్థానం దక్కించుకోగా, ఈనెల 17న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాన్ని సర్పంచ్ పొడియం సుజాత, కార్యదర్శి షర్మిల, కలెక్టర్ అనుదీప్ అందుకున్నారు. కాగా, అవార్డుతో రూ.50 లక్షల పురస్కారాన్ని అందజేయనున్నట్లు తొలుత ప్రకటించారు. కానీ కేంద్రం చేసిన మార్పులతో నగదు పురస్కారాన్ని రెండింతలు చేసి రూ.కోటి నగదును గౌతంపూర్ గ్రామపంచాయతీ బ్యాంకు ఖాతాలో జమ చేశారని డీపీఓ రమాకాంత్ తెలిపారు.

మొక్కజొన్న కొనుగోలు చేయాలని ధర్నా


నాగులవంచలో ధర్నా చేస్తున్న రైతులు

చింతకాని: మొక్కజొన్న పంటను మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని నాగులవంచలో ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారిపై గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మొక్కజొన్న పంట చేతికొచ్చి నెల గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు తక్కువ ధరకు సేకరిస్తున్నారని తెలిపారు. గతనెలలో వర్షాలతో నష్టపోయిన తాము వచ్చిన కొద్దిపాటి పంటనైనా మద్దతు ధరకు అమ్ముకుందామనుకుంటే ప్రభుత్వ తీరుతో నష్టం జరుగుతోంని చెప్పారు. ఇకనైనా మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు పోలీసులు నచ్చచెప్పటంతో రైతులు ఆందోళన విరమించారు. రైతులు ఆలస్యం రవి, కోలేటి నాగేశ్వరరావు, ఏట్యూరి రవి, అంబటి లచ్చయ్య, బైరు బ్రహ్మం, ఆలస్యం నాగేశ్వరరావు, కోలేటి చినబ్రహ్మయ్య, బైరు స్వామి, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పించకుండానే తండ్రి.. పొందకుండానే కుమారుడు..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ మృతి

- నకిరేకల్ బైపాస్ శివారులో ఘటన
- సింగరేణి మెడికల్ బోర్డు కేసులో కోర్టు వాయిదాకు వెళ్తుండగా ప్రమాదం
- రుద్రంపూర్ ఏరియాలో విషాదం


కుసుమ మల్లేష్


అవినాష్ (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): ఉమ్మడి నల్లగొండ జిల్లా నకిరేకల్ బైపాస్ శివారు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు, అతని కుమారుడు మృతి చెందారు. ఈ విషాద సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రుద్రంపూర్ మార్కెట్ ఏరియా బ్యారక్ ప్రాంతానికి చెందిన కుసుమ మల్లేష్ (59) సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకే ఓసీలో ఈపీ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతను తన తండ్రి చంద్రయ్య నుంచి సింగరేణిలో డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ ద్వారా ఉద్యోగం పొందాడు. సుమారు 33 ఏళ్ల సర్వీసు పూర్తిచేశాక అనారోగ్యానికి గురవడంతో తనను అన్‌ఫిట్ చేయాలని మెడికల్ బోర్డుకు దరఖాస్తు పెట్టుకున్నాడు. తన కుమారుడు అవినాష్(32)కు ఉద్యోగం ఇవ్వాలని విన్నవించాడు. 2022లో మెడికల్ బోర్డ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించిన యాజమాన్యం మల్లేష్‌కు ఉన్న నరాల జబ్బు గుర్తించకుండా ‘ఫిట్ ఫర్ సేమ్ జాబ్’ అని ధ్రువీకరించింది. దీంతో తనకు జబ్బులున్నా సింగరేణి యాజమాన్యం అన్‌ఫిట్ (మెడికల్ ఇన్‌వాలిడేషన్) చేయలేదంటూ మల్లేష్ కోర్టుకు వెళ్లాడు. న్యాయస్థానం ఆదేశాల మేరకు యాజమాన్యం మళ్లీ మెడికల్ బోర్డ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించింది. ఈసారి కూడా అన్‌ఫిట్ చేయలేదు. దీంతో మల్లేష్ మరోసారి కోర్టుకు వెళ్లాడు. ఈ కేసుకు సంబంధించి గురువారం హైకోర్టులో హియరింగ్ ఉంది. కాగా బుధవారం రాత్రి సెకండ్ షిఫ్ట్ విధులు నిర్వర్తించి, రాత్రి ఇంటికి వచ్చి పడుకున్నాడు. గురువారం తెల్లవారుజామున తండ్రీకొడుకులు కారులో హైదరాబాద్ బయల్దేరారు. నకిరేకల్ బైపాస్ శివారు నెల్లిబండ గ్రామం హైవే వద్ద కల్వర్టును కారు ఢీకొని ప్రమాదం జరిగింది. దీంతో ఇద్దరూ మృతి చెందారు.

మిగిలిన తల్లీకుమార్తెలే..

మల్లేష్‌కు భార్య, కుమార్తె శాలిని, కుమారుడు అవినాష్ ఉన్నారు. ఇద్దరికీ ఉన్నత చదువులు చదివించాడు. పిల్లలిద్దరికీ వివాహం చేయలేదు. తన ఉద్యోగం కుమారుడికి ఇప్పించాక శుభకార్యాలు చేయాలనే తలపెట్టాడు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం తండ్రీకొడుకులను కబళించింది. దీంతో తల్లి, కూతురు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రుద్రంపూర్ బ్యారక్ ఏరియాలో, కార్మిక వర్గాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మారని యాజమాన్యం తీరు..

మెడికల్ ఇన్‌వాలిడేషన్‌లో ప్రక్రియలో సింగరేణి యాజమాన్యం తీరు మారడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులు, నడవలేని స్థితిలో ఉన్న వారిని, గుండెకు స్టంట్లు వేయించుకున్నవారిని అన్‌ఫిట్ చేయకుండా, లంచాలు ముట్టజెప్పినవారినే అన్‌ఫిట్ చేస్తోందనే విమర్శలు ఉన్నాయి. అనారోగ్యం బారిన పడ్డ పలువురు కార్మికులు తమను అన్‌ఫిట్ చేయాలని సింగరేణి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మల్లేష్ కూడా విధులు నిర్వర్తించలేని స్థితిలో తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించేందుకు న్యాయపోరాటం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే రోడ్డు ప్రమాదానికి గురై కుమారుడితో సహా మృతి చెందాడు. ఇప్పటికైనా సింగరేణి ఉన్నతాధికారులు తీరు మార్చుకుని అర్హులకు న్యాయం చేయాలని పలువురు పేర్కొంటున్నారు.

కూతురు చెంతకు చేరిన తల్లి



దేవమ్మను కూతురికి అప్పగిస్తున్న సఖి సెంటర్ నిర్వాహకులు

వరంగల్: సొంత గ్రామం నుంచి తప్పిపోయి వచ్చిన ఓ తల్లిని వరంగల్ సఖి కేంద్రం నిర్వాహకులు గురువారం ఆమె కూతురు వద్దకు చేర్చారు. నాలుగు నెలలుగా లేదనుకున్న అమ్మ ఇంటికి రావడంతో ఆ కూతురు ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం దుక్యా తండాలో గుర్తుతెలియని మహిళ నెల రోజులుగా ఉంటోందని గ్రామస్తులు మహిళా హెల్ప్‌లైన్ ద్వారా ఈనెల 13న వరంగల్ సఖి సెంటర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో రెస్క్యూ టీం సభ్యులు ఆమెకు ఆశ్రయం కల్పించి వివరాలు ఆరా తీయగా తన పేరు భీమడ్ల దేవమ్మ అని, భర్త చనిపోయాడని చెప్పడమేకాక కూతురు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం నాచుపల్లిలో ఉంటోందని వెల్లడించింది. దీంతో ఖమ్మం జిల్లా సఖి సెంటర్ బాధ్యులకు ఆమె ఫొటో, వివరాలు పంపించగా వారు సీడీపీఓ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్ల సాయంతో దేవమ్మ కూతురు, అల్లుడిని గుర్తించి సమాచారం ఇచ్చారు. ఈమేరకు వారు బుధవారం వరంగల్ రాగా, దేవమ్మను అప్పగించినట్లు సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ వల్లె శ్రీలత, సిబ్బంది నూర్జహాన్, నిర్మలాదేవి తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి గల్లంతు


గల్లంతైన లాలు

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెంలో ఈతకు వెళ్లిన విద్యార్థి గల్లంతయ్యాడు. ముదిగొండ మండలం గోకినేపల్లికి చెందిన షేక్ లాలు (13) స్నేహితులతో కలిసి గువ్వలగూడెంలోని గ్రానైట్ క్వారీ(కుంట)లో గురువారం ఈతకు వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండడంతో ఈత కొడుతూనే లాలు మునిగిపోయాడు. దీంతోస్నేహితులు పరుగున వెళ్లి స్థానికులకు చెప్పగా వారు వచ్చి గాలించినా ఆచూకీ లభించలేదు. కాగా, మిగతా విద్యార్థులు అప్రమత్తమై బయటకు రావడంతో పెనుప్రమాదం తప్పిందని చెబుతున్నారు. గువ్వలగూడెం, గోకినేపల్లి గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో చేరుకుని కుంటలోని నీటిని ట్రాక్టర్ల ద్వారా తోడుతున్నారు. అయితే, చీకటి పడటంతో గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది.

పోయిన ఫోన్ గుర్తించిన పోలీసులు

ఖమ్మంరూరల్: ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే గతంలో గుర్తించడం కష్టమయ్యేది. కానీ తాజాగా అందుబాటులోకి వచ్చిన సీఈఐఆర్ సైట్‌లో ఫోన్ పోగానే వివరాలు నమోదు చేస్తే పోలీసులు గుర్తించగలుగుతున్నారు. నాయుడుపేటకు చెందిన దిలీప్ కూరగాయలు అమ్ముతూ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేయించి ట్రేస్ చేశారు. ఈమేరకు ఫోన్‌ను దిలీప్‌కు గురువారం అప్పగించినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ తల్లాడ గ్రామంలో కొత్తగా ఇల్లు 400 చదరపు గజముల్లో ఉన్న డబుల్ బెడ్ రూమ్, హాల్, కిచెన్ చుట్టూ, కాంపౌండ్ వాల్ అన్ని సౌకర్యాలతో కలిగి ఉన్న ఇల్లు 30 లక్షలకే అమ్మబడును. 90590 06969. [M-1190724]

Services

BUSINESS OFFER

■ మీ ఇంటి నుండి పని చేయాలనుకొనేవారు! మా బిజినెస్ ఆఫర్స్‌లో చేరండి. మీ డబ్బు పెట్టుబడి రిస్క్, ఫీల్డ్ వర్క్ లేకుండా నెలసరి ఆదాయం. సంప్ర. సెల్ : 91826 34359. [M-1190715]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888 [B-1193785]

Wanted

■ ప్రముఖ లైఫ్ మరియు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఖమ్మం & కొత్తగూడెం నందు పని చేయుటకు ఆడ/మగ బిజినెస్ అసోసియేట్స్, టీమ్ లీడర్స్ కావలెను. అ: 10th, 25 సం॥పైన. సంప్ర. 77806 62996. [M-1190677]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 83500/- సంపాదించుకోండి. వాట్సాప్ కాల్ చేయండి. 9573633520, 9059633520 [M-1190672]

■ కోదాడ దగ్గర సిమెంట్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం : 16,000/-.ఫ్రీ రూం. తక్కువ రేటులో క్యాంటిన్ సౌకర్యం. సంప్ర॥ 8464835928, 6304488636 [Y-784360]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785870]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888 [H-793416]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182, 9010299957
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా...

అన్ని ప్రశ్నలకు అవినాశ్‌రెడ్డి సమాధానాలు

- రెండో రోజు సీబీఐ విచారణకు హాజరైన ఎంపీ

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఎంపీ అవినాశ్‌రెడ్డిని గురువారమూ విచారించారు. అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు ఎంపీ అవినాశ్‌రెడ్డి సమాధానాలు ఇచ్చినట్టు సమాచారం. హైకోర్టు ఆదేశాల మేరకు వరుసగా రెండో రోజు సీబీఐ అధికారుల దర్యాప్తునకు ఎంపీ అవినాశ్‌రెడ్డి హాజరయ్యారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం అధికారులు ఆయనకు లిఖిత పూర్వకంగా ప్రశ్నలు అందించారు. వాటన్నింటికీ ఎంపీ సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని ఆడియో, వీడియో రికార్డు చేశారు. శుక్రవారం సైతం ఆయన సీబీఐ ఎదుట విచారణకు హాజరుకానున్నట్టు సమాచారం. మరోవైపు వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలను గురువారం రెండో రోజు ఆరు గంటల పాటు ప్రశ్నించారు. దర్యాప్తు సందర్భంగా న్యాయవాదిని అనుమతించి, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఆడియో, వీడియో రికార్డింగ్‌పై హైకోర్టు గురువారం జారీ చేసిన ఆదేశాల మేరకు సీబీఐ అధికారులు చర్యలు తీసుకున్నట్టు తెలిసింది. అనంతరం భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా, వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి విచారణ పూర్తయ్యే వరకు వారి న్యాయవాదులను అనుమతించాలని తెలంగాణ హైకోర్టు సీబీఐని ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు విచారణ జరపాలని, ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టం చేసింది. న్యాయవాదిని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే సీబీఐ అనుమతించిందని, విచారణ ముగిసే దాకా ఉండేలా ఆదేశాలివ్వాలని భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.సురేందర్ గురువారం విచారణ జరిపారు.

బీఈడీలో ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్

సాక్షి, హైదరాబాద్: బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్డ్ ట్రైబ్ కేటగిరీల రిజర్వేషన్‌ను పెంచారు. గతంలో ఉన్న 6శాతం రిజర్వేషన్‌ను 10శాతానికి పెంచారు. ఈమేరకు విద్యాశాఖ కార్యదర్శి కరుణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంసెట్ సహా వివిధ సెట్స్ ద్వారా జరిగే ప్రవేశాలకు ఈ తరహా రిజర్వేషన్ ఇస్తూ ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులిచ్చింది.

100 మంది మహిళలతో మిల్లెట్ ఔట్‌లెట్లు



త్వరలోనే ఔత్సాహికుల ఎంపిక.. ఔట్‌లెట్ల కేటాయింపు

- పూచీకత్తు లేకుండా బ్యాంకు రుణాలు ఇప్పించనున్న టీఎస్ ఆగ్రోస్
- చిరుధాన్యాల ఉత్పత్తులు సరఫరా చేయనున్న అక్షయపాత్ర ఫౌండేషన్
- ఔత్సాహికులకు ఐఐఎంఆర్‌లో అవగాహన కల్పించిన ఇరు సంస్థలు

సాక్షి, హైదరాబాద్: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వారిని వ్యాపారవేత్తలుగా మలిచేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలోని టీఎస్ ఆగ్రోస్ చర్యలు చేపట్టింది. మార్కెట్లో డిమాండ్‌గల చిరుధాన్యాల ఉత్పత్తుల వ్యాపారంలో మహిళలను భాగస్వాములను చేయాలని, స్టార్టప్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వారితో రాష్ట్ర వ్యాప్తంగా చిరుధాన్యాలు, వాటి ఉత్పత్తులను విక్రయించేందుకు ఔట్‌లెట్స్ ఏర్పాటు చేయించనుంది. ఈ దిశగా కసరత్తులో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పలు జిల్లాల నుంచి వంద మందికిపైగా ఔత్సాహిక మహిళలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ చైర్మన్ విజయసింహారెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ప్రత్యేక కమిషనర్ హనుమంతు, ఆగ్రోస్ ఎండీ రాములు, అక్షయపాత్ర, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

తొలి దశలో...

మిల్లెట్ ఔట్‌లెట్లను తొలిదశలో జిల్లా కేంద్రాల్లో ఒకట్రెండు చొప్పున, జీహెచ్‌ఎంసీ పరిధిలో పది ఔట్‌లెట్లను ఏర్పాటు చేయాలని టీఎస్ ఆగ్రోస్, అక్షయపాత్ర నిర్ణయించాయి. త్వరలోనే ఔత్సాహిక మహిళల్ని ఎంపిక చేసి వారికి ఔట్‌లెట్లు కేటాయించేలా కసరత్తు జరుగుతోంది. మిల్లెట్ ఔట్‌లెట్లలో అక్షయపాత్ర కీలకపాత్ర పోషించనుంది. వ్యాపారానికి అవసరమైన చిరుధాన్యాలను, వాటి ఉత్పత్తులను ఈ సంస్థనే సరఫరా చేయనుంది. దీంతోపాటు ప్రత్యేకంగా షాప్ అద్దెకు తీసుకోలేని వారి కోసం ప్రత్యేకంగా కంటెయినర్ షాప్‌లను కూడా అక్షయపాత్ర రూపొందించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే టీఎస్ ఆగ్రోస్, అక్షయపాత్ర మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. చిన్నారులు మొదలుకొని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధుల వరకు అవసరమైన చిరుధాన్యాల ఆహారాలను ఈ సంస్థ అందించనుంది. మొత్తం 68 రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచనుంది. ముఖ్యంగా చిన్నపిల్లల కోసం చిరుధాన్యాలతో నూడుల్స్, బిస్కెట్స్ వంటి వాటిని కూడా తయారు చేస్తోంది. ఔత్సాహిక మహిళలు పూచీకత్తు సమర్పించాల్సిన అవసరం లేకుండానే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ద్వారా టీఎస్ ఆగ్రోస్ రుణాలు ఇప్పించనుంది. సదస్సులో పాల్గొన్న బ్యాంక్ ప్రతినిధులు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఒక్కొక్కరికీ వ్యాపార విస్తరణ, పెట్టుబడిని బట్టి రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు రుణాలు అందించేందుకు బ్యాంకు ముందుకొచ్చింది. ఈ కార్యక్రమం అనంతరం ఔత్సాహిక మహిళలకు ఏర్పాటు చేసిన భోజనంలో మిల్లెట్ పులిహోర, మిల్లెట్ సాంబార్ ఫుడ్, మిల్లెట్ కర్డ్ ఫుడ్, మిల్లెట్ రోటీ, మిల్లెట్ ఐస్‌క్రీం వంటి వాటిని అందించారు.

మరో వంద ప్రాథమిక సహకార సంఘాలు

- గ్రామానికో సంఘం ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు కేంద్ర సహకార శాఖ సూచన
- అలాగైతే రాష్ట్రంలో 12 వేలకు పైగా ఏర్పాటు చేయాలి
- కానీ, సాధ్యంకాదని తెలంగాణ వాదన
- ప్రస్తుతం 906 ఉండగా, మరో 100 పెంచాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: దేశంలో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కేంద్ర సహకారశాఖ నిర్ణయించింది. అందులో భాగంగా ప్రతీ గ్రామానికి ఒక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) ఉండాలని రాష్ట్రాలకు సూచించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 906 సహకార సంఘాలున్నాయి. కేంద్రం సూచనను అమలు చేయాల్సి వస్తే, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 12,769 గ్రామాల్లోనూ ప్యాక్స్‌ను ఏర్పాటు చేయాలి. అయితే అలా చేయడం వాణిజ్యపరంగా ఏమాత్రం లాభదాయకం కాదని, పైగా వాటిని నడిపించడం సాధ్యం కాదని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తేల్చిచెప్పింది. ప్రస్తుతం రాష్ట్రంలో మండలానికో ప్యాక్స్ ఉండగా, కొన్ని జిల్లాల్లో మండలానికో రెండు చొప్పున ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం గ్రామానికో ప్యాక్స్ సాధ్యం కాకున్నా, ఇప్పుడున్న ప్యాక్స్ సంఖ్యను రెట్టింపు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు టెస్కాబ్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతానికి మాత్రం కొత్తగా 100 ప్యాక్స్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అక్కడి నుంచి అనుమతి వస్తే త్వరలో ఏర్పాటు చేస్తారు.

రైతులకు మరిన్ని సేవలు...

రైతులకు రుణాలతోపాటు పలు రకాల సేవలు అందించడంలో ప్యాక్స్ కృషి చేస్తున్నాయి. కొత్త ప్యాక్స్ ఏర్పాటుతో రైతులకు సేవలు మరింత చేరువకానున్నాయి. రాష్ట్రంలోని మెజార్టీ ప్యాక్స్ ప్రస్తుతం రైతులకు రుణాలు ఇవ్వడం, ధాన్యం కొనుగోలు చేయడం వంటి మూడు నాలుగు సేవలకే పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్యాక్స్‌ను కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్సీ)గా మార్చి రైతులకు సుమారు 25–30 సేవల్ని అందించే విధంగా టెస్కాబ్ కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు కొత్త మండలాలను, కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కొత్తగా ఏర్పాటు చేసిన మండలాలు, గ్రామ పంచాయతీల్లో ప్యాక్స్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో అక్కడి రైతులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వంద ప్యాక్స్‌లను ఏర్పాటు చేయనున్నారు. కాగా, 2005కు ముందు తెలంగాణ ప్రాంతంలో 1800 వరకు ప్యాక్స్ ఉండేవి. కానీ వైద్యనాథన్ కమిషన్ సిఫార్సులతో ప్యాక్స్‌ల సంఖ్యను కుదించారు. దీంతో వాటి సంఖ్య 906కు పడిపోయిందని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తెలిపారు. రైతులకు ఉత్తమ, నాణ్యమైన సేవల్ని అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ఆడిటర్‌ను నియమించే అధికారం ఉంది

- మార్గదర్శి పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో ఏపీ సర్కార్ వాదనలు
- మార్గదర్శి బ్యాలెన్స్ షీట్‌ను ఫైల్ చేయడం లేదు
- లోపాలున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది

సాక్షి, హైదరాబాద్: 'చిట్‌ఫండ్స్‌కు సంబంధించిన అవకతవకలపై ప్రాథమిక ఆధారాలున్నప్పుడు నిశితంగా పరిశీలించి నిగ్గు తేల్చేందుకు ప్రైవేట్ ఆడిటర్‌ను నియమించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్లు ఈ విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. అసలు ఈ పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు లేదు' అని తెలంగాణ హైకోర్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివేదించింది. మార్చి 13, 15, 18న ఏపీ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ – ఐజీ ఇచ్చిన ఆదేశాలను కొట్టి వేయడంతోపాటు ఆడిటర్ వేములపాటి శ్రీధర్ నియామకాన్ని, తమ సంస్థలో ఆయన ద్వారా ఆడిటింగ్ చేపట్టడాన్ని రద్దు చేయాలంటూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ సుదీర్ఘంగా వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు.

హైకోర్టుల పరిధిని సుప్రీం స్పష్టంగా చెప్పింది

'తనిఖీలు నిర్వహించిన 37 బ్రాంచీలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. కేసులు అక్కడే నమోదయ్యాయి. విచారణ అధికారులు కూడా అక్కడివారే. అలాంటప్పుడు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయడం సరికాదు. పరిధి కాకున్నా మార్గదర్శి ప్రతిసారీతెలంగాణ హైకోర్టులోనే పిటిషన్లు దాఖలు చేస్తోంది. వీటిపై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు లేదు. మార్గదర్శి నుంచి స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, రిజిస్టర్లను పరిశీలించగా అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో వీటిపై క్షుణ్నంగా పరిశీలన జరిపేందుకు ఆడిటర్‌ను నియమించాం. చిట్‌ఫండ్స్ చట్టం సెక్షన్ 61 సబ్ సెక్షన్ 2 ప్రకారం ప్రైవేట్ ఆడిటర్‌ను నియమించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. సబ్ సెక్షన్ 4 ప్రకారం డాక్యుమెంట్లను ఆడిట్ చేసే అధికారం కూడా ఉంది. ఒకటి రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని అంశాల్లో తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. హైకోర్టుల పరిధికి సంబంధించి సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పష్టంగా నిర్వచించింది. ఒక హైకోర్టు పరిధిలో మరో హైకోర్టు పరిధి దాటి కలుగజేసుకోరాదని ఆదేశించింది' అని ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి నివేదించారు.

60 ఏళ్లైనా తప్పు తప్పే అవుతుంది

'సేకరించిన నగదును అక్రమ మార్గాల్లో సొంత కంపెనీలకు, షేర్ మార్కెట్లకు, మ్యూచువల్ ఫండ్స్‌కు మార్గదర్శి మళ్లిస్తోంది. దాదాపు 46 రోజుల తర్వాత కోర్టును ఆశ్రయించడం సమర్థనీయంకాదు. దాదాపు 6 దశాబ్దాలుగా చిట్‌ఫండ్స్ నడుపుతున్నామని పిటిషనర్ చెబుతున్నారు. 60 దశాబ్దాలుగా నడుపుతున్నా.. తప్పు తప్పే అవుతుంది కానీ ఒప్పు కాదన్న విషయం గ్రహించాలి. కొన్ని సంవత్సరాలుగా మార్గదర్శి బ్యాలెన్స్ షీట్ ఫైల్ చేయడం లేదు. లాభ నష్టాలకు సంబంధించి దీన్ని ఏటా ప్రభుత్వానికి తప్పకుండా సమర్పించాలి. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీ వద్ద ఫైల్ చేస్తున్నామంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. ఇది చట్టాలను ఉల్లంఘించడమే. వీటిని పరిగణనలోకి తీసుకుని పిటిషన్‌ను కొట్టివేయాలి' అని స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి కోరారు. కాగా, ఈ కేసులో ప్రభుత్వం నియమించిన ఆడిటర్ కౌంటర్ దాఖలు చేయకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వవద్దని ఆడిటర్ తరఫు న్యాయవాది పట్టాభి పేర్కొన్నారు.

'మార్గదర్శి'లో కొనసాగుతున్న సోదాలు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో వరుసగా రెండో రోజు గురువారం కూడా సీఐడీ సోదాలు కొనసాగాయి. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, అనంతపురంలోని మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో సోదాలు జరిపి కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. అక్రమ డిపాజిట్లు, అక్రమ పెట్టుబడులు, హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి నిధుల మళ్లింపునకు సంబంధించిన రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. బ్రాంచి కార్యాలయాలు, ప్రధాన కార్యాలయంలోని రికార్డుల్లో వివరాలకు ఏమాత్రం పొంతన లేదన్న విషయాన్ని సీఐడీ గుర్తించింది. దీనిపై బ్రాంచి మేనేజర్లు, సిబ్బందిని ప్రశ్నించి వారి స్టేట్‌మెంట్లను నమోదు చేస్తున్నారు. దాదాపు 15 అంశాలకు సంబంధించి అవకతవకలను గుర్తించినట్లు తెలిసింది. మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో శుక్రవారం కూడా సీఐడీ సోదాలు కొనసాగనున్నాయి. ఈ సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం తదుపరి కార్యాచరణను వేగవంతం చేయాలని సీఐడీ భావిస్తోంది.

అరెస్టు భయంతో అందుబాటులో లేని మేనేజర్లు..

ఏలూరు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లు కార్యాలయంలో అందుబాటులో లేరని చెబుతున్నారు. ఇప్పటికే ముందస్తు బెయిల్ తీసుకున్నారని, అయినా అరెస్టు చేస్తారనే భయంతో కార్యాలయానికి రావడం లేదని అంటున్నారు. మార్గదర్శిలో చిట్స్‌కు సంబంధించి ఖాతాదారుల వివరాలు, చిట్ల చెల్లింపులు, జమలకు సంబంధించి రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు చెబుతున్నారు. సీఐడీ డీఎస్పీ స్థాయి అధికారులతో పాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్‌కు సంబంధించి పలువురు అధికారులు ఈ సోదాల్లో పాల్గొంటున్నట్టు సమాచారం.

జిల్లా వార్తలు

ఉచిత శిక్షణకు ఈనెల 23న స్క్రీనింగ్ టెస్ట్

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతకు గ్రూప్–4 ఉద్యోగ పరీక్ష కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు దరఖాస్తుదారుల్లో అర్హులను ఎంపిక చేసేందుకు ఈనెల 23న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. భద్రాచలంలోని చర్ల రోడ్డులో ఉన్న గిరిజన బీఈడీ కళాశాల, ఇల్లెందులోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉదయం 11నుండి 12:30 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు ఎకనాలెడ్జ్‌మెంట్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో గంటముందుగా హాజరుకావాలని సూచించారు. కాగా, ఐటీడీఏ ఆధ్వర్యాన గతంలో శిక్షణ తీసుకున్నవారు అనర్హులని పీఓ వెల్లడించారు.

గిరిజన గురుకులాల్లో సమ్మర్ క్యాంప్‌లు

భద్రాచలం: గిరిజన గురుకులాల్లో ఈనెల 22 నుంచి సమ్మర్ క్యాంప్‌లు ప్రారంభిస్తున్న భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. ఈ క్యాంపుల్లో పదిహేను రోజుల పాటు బాలబాలికలకు వివిధ అంశాల్లో శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గండుగులపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 100 మంది బాలబాలికలకు ఆర్చరీ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇక సుదిమల్ల ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వంద మందితో స్పార్క్‌లే క్యాంపు, సింగరేణి గిరిజన గురుకులంలో 200 మంది బాలురతో స్పార్క్‌లే క్యాంపు ఉంటాయని పేర్కొన్నారు. స్పార్క్‌లే విభాగంలో బాలబాలికలకు ఇంగ్లిష్, డ్రోన్ తయారీ, మోడలింగ్, సైన్స్ ప్రయోగాలపై నిష్ణాతులతో శిక్షణ ఇప్పిస్తామని పీఓ వివరించారు. కాగా, ఈ క్యాంపులకు భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ(జనరల్) డేవిడ్‌రాజ్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారని పీఓ తెలిపారు.

ఎస్సీ గురుకులాల్లో ప్రవేశానికి 23న పరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలకు వీటీజీ సెట్ ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓ కె.ప్రత్యూష తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సాంఘిక గురుకుల విద్యాలయాల సంస్థ వెబ్‌సైట్ నుండి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 23న ఉదయం 11నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పరీక్ష కోసం ఖమ్మం జిల్లాలో 17, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 12, మహబూబాబాద్ జిల్లాలో పది కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అటవీ ఉద్యోగులకు అండగా...



అటవీశాఖ సిబ్బంది (ఫైల్) (ఇన్‌సెట్) సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అటవీ ఉద్యోగులు (ఫైల్)

- విధుల్లో మృతి చెందినా, గాయపడినా పరిహారం
- తాజాగా జీఓ 43 విడుదల చేసిన ప్రభుత్వం
- ఏళ్ల తర్వాత తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగుల్లో హర్షం

చుంచుపల్లి: అడవుల సంరక్షణే ధ్యేయంగా, ప్రత్యేక పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్న అటవీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలవనుంది. అసాంఘిక శక్తులు, ఆందోళనకారుల దాడుల్లో మరణించినా, గాయపడినా వారికి ఆర్థిక పరిహారం చెల్లించి ఆదుకునేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన జీఓ 43ను తాజాగా విడుదల చేసింది. విధి నిర్వహణలో తరచూ దాడులను ఎదుర్కొంటున్న అటవీ ఉద్యోగులు ఒక్కోసారి ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొన్ని సార్లు మృత్యువు నుంచి తప్పించుకున్నా, తీవ్రంగా గాయపడి శాశ్వతంగా విధులకు దూరమవుతున్నారు. గతేడాది నవంబర్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు అటవీ ప్రాంతంలో గొత్తికోయల చేతిలో ఎఫ్ఆర్వో చలమల శ్రీనివాసరావు హత్య రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటన నేపథ్యాన అటవీశాఖ ఉద్యోగులకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేటగిరీల వారీగా పరిహారాన్ని ప్రకటించింది. తద్వారా అనుకోనిదేదైనా జరిగితే ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉంటుందని చెబుతున్నారు.

సవాళ్ల నడుమ విధులు

ఉమ్మడి జిల్లాలో 13 లక్షలపైగా ఎకరాల్లో అటవీ విస్తీర్ణం ఉంటుంది. ఈమేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 10.40 లక్షల ఎకరాల పరిధిలో అడవులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 818 మంది ఉద్యోగులు అటవీశాఖలో పనిచేస్తున్నారు. ఆయా ఉద్యోగులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, రేంజ్ ఆఫీసర్లది కీలకపాత్ర. అడవుల సంరక్షణకు 24 గంటల పాటు డేగ కళ్లతో నిఘా పెట్టాలి. వీటికి తోడు అప్పుడప్పుడూ ప్రభుత్వపరమైన సర్వేలు, గ్రామసభలు, ఎన్నికల విధులతో మరింత భారం పడుతోంది. ఇక బీట్ ఆఫీసర్లకు జాబ్‌చార్ట్ లేకపోవడంతో అన్ని వేళకా విధులకు అందుబాటులో ఉండాల్సిందే. సాధారణంగా వెయ్యి హెక్టార్ల భూవిస్తీర్ణం పరిధిలో ఒక బీట్ ఆఫీసర్ పని చేయాల్సి ఉన్నా అలా జరగడం లేదు. దీంతో ఉన్న వారిపైనే అదనపు భారం పడుతోంది. కలప స్మగ్లింగ్, వన్యప్రాణులు, మొక్కల సంరక్షణ, పోడు భూములకు భద్రత వంటి విధులతో తీరికలేకుండా గడపాల్సి వస్తుంది.

అటవీ సిబ్బందికి పరిహారం ఇలా..

- ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు తత్సమాన ర్యాంకు ఉద్యోగులు హింసలో మరణిస్తే రూ.30 లక్షలు, శాశ్వత వైకల్యానికి గురైతే రూ.20 లక్షలు, ఉగ్రదాడుల దాడిలో తీవ్రంగా గాయపడితే రూ.3 లక్షల పరిహారం అందజేస్తారు.
- ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు తత్సమాన ర్యాంకులు అధికారులు విధుల్లో మరణిస్తే రూ.45 లక్షలు, శాశ్వత అంగవైకల్యం ఏర్పడితే రూ.25 లక్షలు, తీవ్రగాయాల పాలైతే రూ.5 లక్షల పరిహారం ఇస్తారు.
- రేంజ్ అధికారులు తత్సమాన ర్యాంకుల ఉద్యోగులు మరణిస్తే పరిహారం రూ.50 లక్షలు, శాశ్వత వైకల్యానికి గురైతే రూ.30 లక్షలు, సాధారణ గాయాలైతే రూ.5 లక్షలు చెల్లిస్తారు.
- అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ తత్సమాన ర్యాంకు అధికారులు మరణిస్తే రూ.75 లక్షలు, శాశ్వత అంగవైకల్యం ఏర్పడితే రూ.40 లక్షలు, సాధారణ గాయాలైతే రూ.5 లక్షలు అందజేస్తారు.
- ఐఎఫ్ఎస్ ర్యాంక్ అధికారులు మరణిస్తే రూ.కోటి, శాశ్వత వైకల్యం ఏర్పడితే రూ.50 లక్షలు, తీవ్రంగా గాయపడితే రూ.6 లక్షల పరిహారం అందజేయనున్నారు.

ఉద్యోగుల కుటుంబాలకు భరోసా



అటవీ ఉద్యోగులకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నిత్యం సవాళ్లను ఎదుర్కొంటున్న మాకు ఎప్పుడేం జరుగుతుందో తెలియదు. గతేడాది ఎఫ్ఆర్ఓ హత్యతో కలత చెందాం. ఇలాంటివి జరిగితే ఉద్యోగుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని నిర్ణయించడం సంతోషంగా ఉంది. – బి.రామకృష్ణ, డీఆర్వో

సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు



అటవీశాఖ ఉద్యోగుల విధులు, వారికేమైనా జరిగితే కుటుంబాలు రోడ్డున పడకుండా ముఖ్యమంత్రి పరిహారం చెల్లించాలని నిర్ణయించడం హర్షణీయం. ఈ నిర్ణయం అటవీ ఉద్యోగులకు బాసటగా నిలుస్తుంది. పెద్ద మొత్తంలో పరిహారాన్ని చెల్లించేందుకు ముందుకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. – ఉమ, ఎఫ్ఆర్ఓ

అంగన్‌వాడీల్లో నాణ్యమైన సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ

ఖమ్మంగాంధీచౌక్: అంగన్‌వాడీ కేంద్రాలను మెరుగ్గా నిర్వహిస్తూ లబ్ధిదారులకు నాణ్యమైన సేవలందించాలని మహిళా శిశు, సంక్షేమ శాఖ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి సూచించారు. ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సంక్షేమాధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు, సూపర్‌వైజర్లకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, సేవలను లబ్ధిదారుల దరికి చేరుస్తూ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. ఇంకా కేంద్రాల్లో పెరటి తోటల పెంపకంపై దృష్టి సారించాలని ఆర్జేడీ సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సంక్షేమాధికారులు సంధ్యారాణి, లెనినా పాల్గొన్నారు.

24న నిరుద్యోగ నిరసన ర్యాలీ

హాజరుకానున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి సంభాని, పక్కన దుర్గాప్రసాద్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలతో పాటు ఎస్సెస్సీ పేపర్ లీకేజీకి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ ఆధ్వర్యాన ఈనెల 24న నిరుద్యోగ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ వెల్లడించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు కావొస్తున్నా ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పులు రాలేదన్నారు. దీనికి తోడు నిరుద్యోగ సమస్యలు మరింత పెరిగిందని చెప్పారు. ఈమేరకు ఖమ్మంలో ఈనెల 24న నిర్వహించనున్న నిరుద్యోగ ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొననుండగా, ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, పీసీసీ సభ్యులు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, రాయల నాగేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రంతో పాటు నాగండ్ల దీపక్‌చౌదరి, కొత్త సీతారాములు, బెల్లం శ్రీనివాస్, యడ్లపల్లి సంతోష్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, యర్రం బాలగంగాధర్ తిలక్, లకావత్ సైదులు నాయక్, తోటకూర రవిశంకర్, మిక్కిలినేని నరేందర్, పల్లెబోయిన చంద్రం తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సకాలంలో వేతనాలు అందజేయాలి

గురుకులాల ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్



టెండర్ల ప్రక్రియను పరిశీలిస్తున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని 22 పోస్ట్ మెట్రిక్ కాలేజీ హాస్టళ్లలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఏజెన్సీల బాధ్యులు సకాలంలో వేతనాలు అందచేయాలని గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గురువారం పోస్ట్ మెట్రిక్ కాలేజీ హాస్టళ్ల బాధ్యతలు అప్పగించేందుకు గాను ఏజెన్సీల ఖరారు ప్రక్రియ చేపట్టారు. ఆయా టెండర్లను మూడు ఏజెన్సీలు దక్కించుకోగా డేవిడ్‌రాజ్ పలు సూచనలు చేశారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించడంతో పాటు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ రమాదేవి, అధికారులు హరీశ్‌రావు, నారాయణరెడ్డి, ప్రమీలబాయి, రమణమూర్తి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



ముఖాముఖిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

చర్ల: రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పేర్కొన్నారు. విద్యారంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై భద్రాద్రి జిల్లా చర్లలోని రైతు వేదికలో గురువారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యాన ముఖాముఖి ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకం, విద్యార్థుల యూనిఫాం కుట్టుకూలీ, టాయిలెట్లు, మౌలిక వసతుల లేమి ప్రధాన సమస్యలుగా ఉన్నాయని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, సీపీఎస్ రద్దు తదితర సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తెలిపారు. ఈక్రమంలో విద్యారంగం ఎదుర్కొంటు న్న సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయులు పోరా టాలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.కిషోర్‌సింగ్, ఎస్.కృష్ణతో పాటు వరలక్ష్మి, బి.మురళీమోహన్, బాలకృష్ణ, రాంబాబు, రాధ, యాదగిరి, వెంకటేశ్వర్లు, హిమగిరి, యడమ రాజు తదితరులు పాల్గొన్నారు.